క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు రూరల్: మండలంలోని బునాదిపురం గ్రామానికి చెందిన కేతముని గాలెన్న మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం పంపించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ స్థానిక నాయకులతో కలిసి గురువారం గ్రామంలో మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థికసాయాన్ని రూ.5 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మేకల గోవిందు, శివరాజ్, గోవిందు, మేకల సురేష్, వనం శేఖర్, రామన్‌గౌడ్, రజనిబాబు, మల్లేష్, రాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలంలో చెలరేగిన మంటలు



పాన్‌గల్: రోజు రోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో భూతాపం పెరుగుతోంది. ఈ ప్రభావంతో గురువారం మండలంలోని కేతేపల్లి సమీపంలో గల ఊరబావి వద్ద నుంచి రత్నారెడ్డి దొడ్డి దాకా మంటలు చెలరేగాయి. అకస్మాత్తుగా చెలరేగిన మంటలు చుట్టుపక్కల వ్యాపించకుండా అంబేడ్కర్ యూత్ సభ్యులు స్పందించి వ్యవసాయ బోరు నీటితో మంటలను అదుపుచేశారు. సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసి ప్రమాదాన్ని నివారించిన అంబేడ్కర్ యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ప్రమాదవశాత్తు మామిడితోటకు నిప్పు



ఆత్మకూర్: మామిడితోటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకున్న ఘటన మండలంలోని ఆరేపల్లిలో గురువారం చోటుచేసుకుంది. రైతు కావలి దేవన్నకు చెందిన మామిడితోటలో సాయంత్రం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో గమనించిన రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మంటల్లో కాపు కాసిన 20కి పైగా మామిడిచెట్లు కాలిపోయినట్లు రైతు తెలిపారు. దీంతో సుమారు రూ.3లక్షలు నష్టం వాటిల్లిందని వాపోయాడు.

పోలీసు కవాతు



పెబ్బేరు రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్థానిక పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి గురువారం పెబ్బేరు పట్టణంలో కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటును వినియోగించుకునేలా భద్రత దళాలతో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

గుణపాఠం చెప్పాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రజలను మోసం చేసే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తమ ఓటుతో గుణపాఠం చెప్పాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని సాతర్ల, వావిలాల, ఉదండాపురం గ్రామాల్లో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేటి వరకు వాటిని మరిచిందన్నారు. మన హక్కులను కాపాడుకునేందుకు భారత రాజ్యాంగమే ఏకైక ఎజెండాగా పనిచేస్తున్న బీఎస్పీకి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

బైక్, బస్సు ఢీ

గోపాల్‌పేట: తాడిపర్తి సమీపంలో బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో గోపాల్‌పేటకు చెందిన యువకుడు గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన రవినాయక్ తన ఇంటి నిర్మాణం కోసం అవసరమైన సామగ్రిని వనపర్తిలో కొనుగోలు చేసి ఆటోలో తరలించి, తాను ద్విచక్రవాహనంపై గోపాల్‌పేటకు వస్తుండగా తాడిపర్తి గ్రామ సమీపంలో ఉన్న మలుపు వద్ద నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రవినాయక్‌కు కాలుకు తీవ్ర గాయమై విరిగిపోయింది. అక్కడే ఉన్న స్థానికులు రవినాయక్‌ను వనపర్తి ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

ఆధార్ కష్టాలు ఇంకెన్నాళ్లు..

- గోపాల్‌పేటలో మూతబడిన ఆధార్‌సెంటర్
- ఏడాది కాలంగా ఇబ్బందులు
- ఎన్నికల తర్వాత ప్రారంభించేందుకు అధికారుల చర్యలు



గోపాల్‌పేట మండల కేంద్రంలో మూసి ఉన్న ఆధార్‌సెంటర్ (ఫైల్)

గోపాల్‌పేట: పుట్టిన పిల్లాడి నుంచి మరణించే వారి వరకు ప్రతిఒక్కరికీ ఆధార్ కార్డు ముఖ్యమైంది. అంతే కాకుండా ప్రభుత్వాల నుంచి అందే ప్రతి పథకానికి ఆధార్ తప్పనిసరి. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో కేవలం ఒకే ఆధార్ సెంటర్ ఉండేది. అది కూడా మూతపడి సుమారు ఏడాది పూర్తయింది. అయినా ఇప్పటికీ తెరుచుకోవడం లేదు. దీంతో ఉమ్మడి గోపాల్‌పేట మండల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 60 వేల జనాభా ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య తొంభై వేలకు చేరి ఉంటుందని అధికారుల అంచనా వేస్తున్నారు. అయితే కొత్తగా ఆధార్ కోసం నమోదు చేసుకునే చిన్న పిల్లలు, పెళ్లయిన వారు అడ్రస్ మార్పు, పేర్లలో తప్పొప్పులు సరిచేసుకునేందుకు ఆధార్ సెంటర్‌కు ప్రజలు వస్తుంటారు. కానీ ఆధార్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లా కేంద్రానికి పరుగులు..

తప్పనిసరి పరిస్థితుల్లో వనపర్తిలో ఉన్న ఆధార్ సెంటర్‌కు వెళితే వారం రోజుల ముందు అక్కడ టోకెన్ తీసుకోవాలి. ఆ తర్వాత వెళ్లినా ఉదయం నుంచి రాత్రి వరకు ఆగి ఆధార్‌కార్డులో మార్పులు చేర్పులు చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేసుకున్న తర్వాత కూడా చాలా వరకు రద్దు అవుతున్నాయని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వనపర్తికి వెళ్లకుండా మండల కేంద్రంలోనే ఆధార్‌సెంటర్ ఉంటే అందరికీ ఇబ్బందులు తొలుగుతాయని, సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అప్లికేషన్లు తిరస్కరణకు గురవుతున్నాయని..

సుమారు ఏడాది క్రితం గోపాల్‌పేట మండల కేంద్రంలో ఉన్న ఆధార్‌సెంటర్‌లో ఎక్కువ మొత్తంలో అప్లికేషన్లు రిజెక్టు అవుతున్నాయన్న కారణంగా ఆధార్‌సెంటర్ ఐడీని బ్లాక్ చేసినట్లు అప్పట్లో అధికారులు చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆధార్‌సెంటర్ ప్రారంభించలేదు. తర్వాత మళ్లీ పరీక్ష పెట్టి అర్హులైన వారికి కేటాయిస్తామని చెప్పిన అధికారులు ప్రస్తుతం దాని ఊసెత్తడం లేదు. దీనిపై మండల ప్రజల నుంచి ఆందోళనలు వ్యక్తం అవుతున్నా అధికారులు స్పందించడం లేదు.

ఇబ్బందులు తప్పడం లేదు



మాపాపకు ఆధార్‌కార్డు తీసేందుకు, భార్య అడ్రస్ మార్చేందుకు వనపర్తిలో సుమారు ఆరు నెలల క్రితం మార్పులు చేయించాం. కానీ ఇప్పటి వరకు కార్డు రాలేదు. ఇప్పటికే ఇబ్బందులు పడ్డాం. మళ్లీ ఆధార్‌సెంటర్‌కు ఎప్పుడు రావాలని అడిగితే మళ్లీ వారం రోజులు తర్వాత అని చెప్పారు. గోపాల్‌పేటలో ఆధార్ సెంటర్ ఉంటే రిజెక్ట్ అయినా మళ్లీ ప్రయత్నించేవాళ్లం. వీలైనంత కేంద్రం ప్రారంభించాలని వేడుకుంటున్నాం.

– సీహెచ్ రాములు, గోపాల్‌పేట

అందుబాటులోకి తేవాలి



ఉమ్మడి గోపాల్‌పేట ప్రజలకు ఒక్కటే ఆధార్ సెంటర్ ఉండేది. అది కూడా ఏడాది నుంచి అందుబాటులో లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలు అమలు చేసేటప్పుడు, లేదా ఇతర ఆధార్ కార్డుల సర్వీస్ కోసం జనాలు వనపర్తికి వెళ్లాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఆలోచించి వెంటనే ఆధార్‌సెంటర్ ప్రారంభించేందుకు కృషి చేయాలి

– విష్ణు, గోపాల్‌పేట

ఎన్నికల తర్వాత..



ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఎన్నికలు అయిన వెంటనే ఆధార్ సెంటర్ ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనువాసులు, తహసీల్దార్, గోపాల్‌పేట

కంచిరావుపల్లిలో బీజేపీ ప్రచారం



పథకాల గురించి వివరిస్తున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం మండలంలోని కంచిరావుపల్లిలో గురువారం బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు, ఉపాధి కూలీలకు వివరిస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దిలీప్‌యాదవ్, సుధీర్, భాస్కర్, మహేష్, శేఖర్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు. మండలంలోని కొత్త సూగూరులో గురువారం బీఎల్‌ఓ స్వరూపరాణి ఓటర్ స్లిప్పులను ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెంచేందుకు ఉన్నతాధికారుల సూచనల మేరకు బూత్‌లెవల్ అధికారులు గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కొల్లాపూర్ రూరల్: హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుడికిల్ల, నార్లాపూర్, మొలచింతలపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబీమా, రైతుబంధు, తులం బంగారం ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రచారం చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. అనంతరం కుడికిల్ల, నార్లాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల దగ్గరకు వెళ్లి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అంజనేయులు గౌడ్, ఎంపీటీసీ బిచ్చయ్య, వెంకటేశ్వరావు, లక్ష్మణ్ రావు, బంగారయ్య, భాస్కర్ రావు, గురువయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, చెన్నయ్య, శేఖర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



కుడికిల్లలో సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

వాలీబాల్ వేసవి శిబిరం ప్రారంభం



మదనాపురం: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో విద్యార్థులకు వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని పీఈటీ రామచంద్రమ్మ ప్రారంభించారు. ఈ క్రీడల్లో మొత్తం 28 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ఆడారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి 14 ఏళ్లలోపు విద్యార్థులందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు. క్రీడల ద్వారానే మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆరోగ్యంగా ఉండాలంటే చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

మద్యం బాబుల అడ్డాగా సబ్‌స్టేషన్

రాజోళి: మండలంలోని పచ్చర్లలో నిర్మాణం నిలిచిపోయిన విద్యుత్ సబ్‌స్టేషన్ మద్యం బాబులకు అడ్డాగా మారింది. నిర్మాణం మధ్యలో నిలిచిపోగా, అందులో మద్యం బాబులు మందు తాగేందుకు వెళ్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అక్కడే విద్యుత్, ఇతర విలువైన పరికరాలు ఉండగా, కార్యాలయం కోసం నిర్మిస్తున్న భవనాన్ని అడ్డాగా మార్చుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యుత్ పరికరాలు అపహరణకు గురయ్యే అవకాశముందని, వాటిని కనీసం భద్రపరచకుండా వదిలేశారని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు అటు వైపు పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మోసపూరిత మాటలు నమ్మకండి: కాంగ్రెస్



వనపర్తిలో కుండలు తయారు చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: జిల్లాలో ఉన్న కుమ్మరులు, కమ్మరులు కాంగ్రెస్ వెంటే ఉన్నారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం మార్నింగ్ వాక్‌లో భాగంగా పోచమ్మగుడి వీధి, కమ్మరి, కుమ్మరి కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కులవృత్తుల వారిని పూర్తిగా విస్మరించిందని దుయ్యబట్టారు. ప్రచారంలో ఎమ్మెల్యేతో పాటు డాక్టర్ పగిడాల శ్రీనివాస్, నాయకులు చందర్, మహేష్, కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

మదనాపురం: పార్లమెంటు ఎన్నికల్లో తప్పుడు వాగ్దానాలతో గెలిచేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ కపట నాటకాలు ఆడుతున్నాయని, అలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ప్రజలను కోరారు. గురువారం మదనాపురం మండలంలో ఎన్నిక ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అజ్జకొల్లు, రామన్‌పాడు, తిర్మలాయపల్లి, దంతనూరు, నర్సింగాపురం, నిల్విడి, కొన్నూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం కొనసాగింది. ఆ గ్రామాల్లో ఎమ్మెల్యేకు కార్యకర్తలు నాయకులు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానం నుంచి ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జగదీష్, వడ్డె కృష్ణ, టీసీ నాగన్నయాదవ్, హనుమాన్‌రావు, అక్కల మహాదేవన్‌గౌడ్, సాయిబాబ, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిర్మలాయపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: ఈ నెల 5న ఎర్రవల్లి చౌరస్తా వద్ద నిర్వహించే రాహుల్‌గాంధీ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ కార్యకర్తలకు సూచించారు. ఆయన గురువారం పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తుందని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఐదు గ్యారెంటీలతో పాటు రాష్ట్రానికి మరిన్ని సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డా. మల్లు రవి మద్దతుగా నిర్వహించే సమావేశానికి రాహుల్‌గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, రాములుయాదవ్, నాయకులు కృపాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

పాన్‌గల్: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ నాయకులు, మహిళా సమాఖ్య సభ్యులు అన్నారు. గురువారం మండలంలోని చిక్కేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్‌యాదవ్, ముంత రాములుయాదవ్, వేమన్న, కుర్మయ్య, నర్సింహ, గ్రామ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మహిళా సంఘం సభ్యులు

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

పాన్‌గల్: మండలంలోని అన్నారం చెరువులో ఒండ్రు మట్టి తరలింపు పనులను గురువారం ఏపీఓ కుర్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే సాగునీటి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి జీపీలో రోజువారీ కూలీలు 200 కు తగ్గకుండా పనులకు వచ్చేలా చూడాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో కూలీలు అన్ని జాగ్రత్తలు పాటించాలని, పనుల వద్ద నీడ, నీటి వసతి తప్పక ఉండాలన్నారు. ఎండల తీవ్రతతో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు, హరితహారంలో నాటిన మొక్కలు ఎండకుండా క్రమం తప్పకుండా వాటర్ క్యూరింగ్ చేయాలని, నర్సరీలోని మొక్కలకు నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల వద్ద వసతుల ఏర్పాటు విషయంలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు.

ఆలోచన విధానం ఉన్నతంగా ఉండాలి

వనపర్తి టౌన్: విద్యార్థుల ఆలోచన విధానం ఉత్తమంగా ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్, జేవీవీ రాష్ట్ర నాయకుడు జితేందర్ అన్నారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకు సాధించిన విజ్ఞాన్ విద్యార్థినులు గాయత్రి, కళ్యాణిని గురువారం శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయ సాధనకు అనుగుణంగా భవిష్యత్తు కార్యచరణను రూపొందించుకోవాలని చెప్పారు. విద్యార్థుల చదువులు సమసమాజ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉపాధి కల్పనతో పాటు సమాజంలో జరుగుతున్న దోపిడి, అణిచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరన్ననాయక్, డీవైఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ మహేష్, మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల, నాయకులు సాయి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఎండీ జబ్బార్, జితేందర్

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



విద్యార్థులకు నగదు అందిస్తున్న సౌజన్యరెడ్డి

అమరచింత: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పట్టణానికి చెందిన లిఫ్ట్ మాజీ అధ్యక్షురాలు కె.సౌజన్యరెడ్డి నగదు ప్రోత్సాహాలకు గురువారం అందించారు. పదో తరగతి ఫలితాల్లో జెడ్పీఉన్నత పాఠశాలకు చెందిన తస్లీమా 9.5 జీపీఏ సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ రూ.పదివేల నగదు బహుమతిని అందించారు. అదే విధంగా 8.8 జీపీఏ సాధించిన శ్రీకాంత్‌కు, 8.7 జీపీఏ సాధించిన వీరేష్, శ్రీకాంత్, సమ్రీన్‌లకు ఒకొక్కరికి రూ.ఐదు వేల నగదు అందించారు. ఈమేరకు సౌజన్యరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ కనపర్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తన వంతుగా నగదు ప్రోత్సాహకాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ సింగ్, ప్రధానోపాధ్యాయుడు బలరాముడు, ఉపాధ్యాయులు వెంకటన్న, విజయప్రకాష్ పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు

వనపర్తి/పెబ్బేరు రూరల్: రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గంలోని పెబ్బేరు, వనపర్తి, శ్రీరంగాపూర్ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో చిన్నారెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెబ్బేరు మండలంలోని యాపర్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు విక్రమ్‌గౌడ్, సుగురు మాజీ సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, బునాదిపురం విజయ్‌గౌడ్, శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు దామోదర్‌గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు రాములుయాదవ్, వనపర్తి మండల మాజీ వైస్ ఎంపీపీ సురేష్‌గౌడ్, పెద్దగూడెం గ్రామానికి చెందిన చందు ఆధ్వర్యంలో సుమారు 450 మంది పార్టీలో చేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనతో ముందుకు సాగుతుందని, ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, వెంకట్రాములు, సురేష్‌గౌడ్, శంకర్‌నాయుడు, జగన్మోహన్‌రెడ్డి, వంశీ, నాగిరెడ్డి, కోటయ్య, నరేందర్, సహదేవుడు, కృపాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సహదేవుడు, విజయ్‌శెట్టి, శివ పాల్గొన్నారు.

యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



సాసనూలులో మత్తుపదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

ఎర్రవల్లిచౌరస్తా: యువత మాదక ద్రవ్యాల బారిన పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోదండాపురం ఎస్‌ఐ స్వాతి అన్నారు. గురువారం ఎర్రవల్లి మండలంలోని సాసనూలు గ్రామంలో ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, విక్రయాలపై పోలీసులు తీసుకునే కఠిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఎక్కడైనా మత్తుపదార్థాల ఉత్పత్తి, రవాణా, విక్రయాలు జరిగితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

ధరూరు: ప్రస్తుత తరుణంలో యువత మాదక ద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందని ఎస్‌ఐ విజయ్‌కుమార్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు మండలంలోని పెద్దపాడులో సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యువకులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి విలువైన జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నారన్నారు. గంజాయి, కల్తీ కల్లు, ఇతర మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనార్థాలపై వివరించారు. రేపటి తరానికి భావి భారత పౌరులుగా నిలవాల్సిన వారే తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తుకు అలవాటు పడటం వల్ల మెంటల్‌గా, ఫిజికల్‌గా, ఫిట్‌నెస్‌ను కోల్పోయి అనారోగ్యం బారిన పడటమే కాకుండా తాము ఏమి చేస్తున్నామో కూడా తెలియని స్థితిలోకి వెళ్లి ఆర్థికపరమైన ఇబ్బందులకు గురవుతారన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నిషేధానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చట్ట విరుద్ధమైన పనులు చేసే వారిని ఉపేక్షించేది లేదని, గ్రామాల్లో అలాంటి వారు ఉంటే మాకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగం వల్ల వ్యక్తులతో పాటు సమాజానికి జరిగే నష్టాన్ని, ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబర్‌తో రూపొందించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.